సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ; 13 ; ఫిబ్రవరి ; 2023



ఇసుక అక్రమ రవాణా
గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేదు.
వివరాలు 8లో ▸



చౌక డీలర్లకు ఈ-పాస్
బియ్యం పంపిణీలో అక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ-పాస్‌ను అమలు చేస్తోంది.
వివరాలు 10లో ▸


గరిష్టం/కనిష్టం
35.4 /19.6

వాతావరణం
ఉదయం చలి తీవ్రత పెరుగుతుంది. రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండప్రభావం చూపుతుంది.

కోతలు.. వెతలు

సమయపాలన లేకుండా ఎడాపెడా పవర్ కట్

- త్రీఫేజ్ సరఫరాలో తీవ్ర అంతరాయం
- 8 నుంచి 10 గంటలకు మించని సరఫరా
- భూగర్భ జలాలున్నా వాడుకోలేని దుస్థితి
- పంటలు ఎండుతుండటంతో రైతుల ఆందోళన



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతుల నెత్తిన విద్యుత్ పిడుగు పడింది. పంటల సాగు ప్రారంభంలోనే విద్యుత్ కోతలు ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఇప్పుడే విద్యుత్ కోతలు విధిస్తే ఎండలు ముదిరితే పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్ 24 గంటలపాటు సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధ పరిస్థితులు కనిపిస్తున్నాయి. త్రీఫేజ్ సరఫరాలో తీవ్రమైన కోతలు పెడుతున్నారు. మొత్తంగా జిల్లాలో వ్యవసాయానికి 8 నుంచి 12 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీనికితోడు కొన్నిచోట్ల రాత్రివేళలో, మరికొన్ని చోట్ల ఉదయం వేళలో సరఫరా చేస్తున్నారు.

బోరుబావులే దిక్కు..

జిల్లాలో యాసంగి వరిసాగు బోరుబావుల ఆధారంగానే సాగవుతోంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఉన్న దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు మాత్రమే ఈ ప్రాజెక్టు నీరు ఆయకట్టుకు అందుతోంది. దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట మండలాల రైతులు వ్యవసాయ బోరుబావులపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల నియోజకవర్గాల్లో సైతం సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో యాసంగిలో బోరు, బావులపైనే రైతులు పంటలు సాగు చేస్తారు. జిల్లాలో 69,731 వ్యవసాయ బోరు కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయానికి ప్రభుత్వం ప్రతిరోజు 15.15 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. కానీ, వాస్తవ పరిస్థితుల్లో ఆ మేరకు సరఫరా చేయడం లేదు. ప్రధానంగా రాత్రివేళలో విద్యుత్ సరఫరా ఉండడంతో రైతులు మళ్లీ పొలాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి వచ్చింది.



జడ్చర్ల మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన రైతు సత్తయ్యకు 5 ఎకరాలు సొంత భూమి ఉండగా మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మొత్తం 25 ఎకరాల్లో పదెకరాల్లో వరి, ఐదెకరాల్లో పల్లి, మూడెకరాలు మొక్కజొన్న, మిగిలింది పత్తి, మిరప పంటలు పండిస్తున్నాడు. సొంతంగా రెండు బోర్లు, కౌలు భూమిలో 4 బోర్లు ఉండగా నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కానీ, కొద్దిరోజులుగా కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవటంతో పొలానికి నీళ్లు పారించలేకపోతున్నాడు. ఫలితంగా మొక్కజొన్న, వరిపంటలు వాడిపోతుండగా.. చేతికొచ్చిన పల్లి పంటను తీయలేని దుస్థితి నెలకొంది. కరెంట్ సరఫరా కోసం రెండురోజుల కిందట రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించగా సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఫలితం లేకపోయింది.

జిల్లా పరిధిలో ఇలా..

యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 81,886 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 1,25,250 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా.. ఇప్పటి వరకు 67,568 ఎకరాల్లో వరినాట్లు వేశారు. వేరుశనగ 29,550 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా 10,979 ఎకరాల్లో సాగైంది. మొక్క జొన్న 3,050 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా 2,699 ఎకరాల్లో, పత్తి 817 ఎకరాల్లో, జొన్న 135 ఎకరాల్లో, రాగులు 26 ఎకరాల్లో, ఆముదం 327 ఎకరాల్లో సాగయ్యాయి.

వరి వైపే మొగ్గు..



జిల్లాలోని దేవరకద్ర, చిన్న చింతకుంట, కోయిలకొండ, భూత్పూర్, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ప్రతి ఏటా వరి పంటను విస్తారంగా సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లోనూ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో చెరువులు, కుంటల కింద, బోరుబావుల కింద పెద్ద ఎత్తున వరినాట్లు వేశారు.

15 గంటలు సరఫరా



వ్యవసాయ రంగానికి ప్రస్తుతం 15 గంటలు విద్యుత్ సరఫరా అవుతోంది. ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రాత్రి 7.30 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఇంతకంటే తక్కువ సమయం విద్యుత్ సరఫరా అవుతుందంటే అది అవాస్తవం. ఎక్కడో ఓచోట రైతుల బోరు మోటార్లకు సంబంధించి ఫీజ్ ఎగిరిపోతే తప్ప సరఫరాలో అంతరాయం ఏర్పడదు. రైతులు ఈ విషయాన్ని గమనించి పగలు, రాత్రి సమయాల్లో సరఫరా అయ్యే విద్యుత్‌ను వాడుకొని పంటలు కాపాడుకోవాలి.
– రమణమూర్తి, ఎస్ఈ, ట్రాన్స్‌కో

10 గంటలు వస్తలేదు..



నేను రెండెకరాల్లో వరి పంట సాగు చేశా. మాకు బోరుబావులే దిక్కు. ప్రస్తుతం 10 గంటలు కూడా విద్యుత్ సరఫరా వస్తలేదు. అది కూడా ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియదు. లైన్‌మెన్లు, విద్యుత్ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెడితేగాని కరెంట్ సరఫరా అవుతుందో.. లేదో తెలియడం లేదు. నిరంతరం విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. – హన్మంతు, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

24 గంటలు వట్టిమాటే



వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ వట్టిమాటే. రోజుకు 8 గంటలే సరఫరా అవుతోంది. అది ఓ రోజు పగలు వస్తే.. మరోరోజు రాత్రి వస్తుంది. సమయమంటూ లేదు. ఇచ్చే కరెంట్ వరుసగా పగటి వేళలో ఇస్తే బాగుంటుంది. కేవలం 8 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో సాగు చేసిన పంటలకు నీరు పారడం లేదు. ముందుముందు వేసవి ఎండలు ముదిరితే పంటల పరిస్థితి ఏమిటో అర్థం కావట్లేదు.
– నర్సింహులు, రైతు, ధర్మాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

కోతలు లేకుండా విద్యుత్ ఇవ్వాలి



నాకున్న నాలుగెకరాల్లో వరి పెట్టాలనుకుని కరిగెట చేసేందుకు సిద్ధమయ్యా. కానీ, ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పొలానికి నీరు పారక ఇబ్బంది పడుతున్నా. ఎండలు ముదిరే సమయంలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంటుంది. కచ్చితంగా 12 గంటల విద్యుత్‌ను కోతలు లేకుండా నిరంతరాయంగా సరఫరా చేస్తేనే పంటలు చేతికొస్తాయి.
– మొగులయ్య, రైతు, లింగాయపల్లి, గండేడ్ మండలం

న్యూస్‌రీల్

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 15 నుంచి వచ్చేనెల 3 వరకు నిర్వహించనున్నట్లు డీఐఈఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం జనరల్ కోర్సుల వారికి 36 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ వారికి 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలకు 9,286 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద హాల్‌టికెట్స్ పొందాలని, సంబంధిత టైం టేబుల్‌ను కళాశాలలకు అందజేశామన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సైన్స్ లెక్చరర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియమించామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి గురి కాకుండా ప్రాక్టికల్స్ చేయాలని సూచించారు.

నేటినుంచి మర్దాన్ అలీషా దర్గా ఉర్సు




స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం షాసాబ్ గుట్టలోగల హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా రహెమతుల్లా అలై దర్గా 96వ ఉర్సు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏడాది కులమతాలకతీతంగా దర్గాలో ఉర్సు నిర్వహిస్తారు. ఉత్సవాల తొలిరోజు దర్గాలో భక్తిశ్రద్ధలతో గుస్లే షరీఫ్ (జలాభిషేకం) చేపడుతారు. మంగళవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. గంథోత్సవాన్ని షేక్ మొహియోద్దీన్ ఇంటి నుంచి వన్‌టౌన్, న్యూటౌన్‌ల మీదుగా దర్గాకు తీసుకెళ్తారు. అనంతరం వందలాది మంది భక్తుల నడుమ దర్గాలో పూల చాదర్లు సమర్పించడంతోపాటు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తారు. బుధవారం దీపారాధన, ఖవ్వాలి ఏర్పాటు చేయనున్నారు. గురువారం ఖత్‌మే ఖురాన్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తారు. ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షాఖాద్రీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వేడుకలకు జిల్లాకేంద్రంతోపాటు హైదరాబాద్, నారాయణపేట, గద్వాల, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేట, మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

మరో ఉద్యమానికి ప్రజలు సిద్ధంకావాలి



మహబూబ్‌నగర్ రూరల్: సామాజిక తెలంగాణ సాధన కోసం మరో ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడం లేదన్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం కూడా అందక అనేక రోగాల బారినపడుతున్నారని ఆరోపించారు. గ్రామీణ స్థాయిలో బీసీలను చైతన్యం చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకొని బీసీ ఐక్యవేదిక పెద్దన్న పాత్ర పోషిస్తూ సామాజిక తెలంగాణ కోసం రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులుగౌడ్, కార్యదర్శి తిమ్మప్ప, కోశాధికారి రంగప్పయాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు నారాయణ, పరశురాం, రాజశేఖర్, శ్రీనివాసులు, మహేష్, తాయప్ప, సత్యనారాయణ, రామకృష్ణ, రవికుమార్, తిరుపతిగౌడ్, నరేష్‌యాదవ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

కురుమూర్తి లిఫ్టుకు నిధులు ఇవ్వండి



చిన్నచింతకుంట: మదనాపురం, చిన్నచింతకుంట మండలాలకు తాగు, సాగునీరు అందించే కురుమూర్తిరాయ లిఫ్టు మరమ్మతు, నిర్వహణకు రూ.2 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శన



నాటకంలోని ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవాలయం సహకారంతో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు అలరించాయి. నాటక ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం రాత్రి వివిధ నాటకాలను ప్రదర్శించారు. శ్రీకృష్ణ రాయభారం, ధర్మజ రాజసూయం నాటకాలు ఆకట్టుకున్నాయి. శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గత ఏడేళ్ల నుంచి నాటక మండలి ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే సోమవారం వివిధ సంస్థలచే శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, మాయలపకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం నాటకాల ప్రదర్శన ఉంటుందని, భక్తులు పద్య నాటకోత్సవాలను తిలకించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా 2కే రన్



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఆర్బీఐ ఫైనాన్షియల్ లిటరసీ వీక్– 2023ను పురస్కరించుకొని ఆదివారం ఉదయం జెడ్పీ నుంచి అశోక థియేటర్ చౌరస్తా, క్లాక్‌టవర్, పాత బస్టాండు, తెలంగాణ చౌరస్తా మీదుగా తిరిగి జెడ్పీ గ్రౌండ్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ గుడ్ ఫైనాన్షియల్ ఇయర్ యువర్ సేవియర్ అన్న థీమ్‌తో రన్ చేపట్టామన్నారు. ప్రజల్లో ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, యువజన సర్వీసులు, వైద్య, ఆరోగ్య, పౌర సంబంధాలు, పాఠశాల, కళాశాల, బ్యాంకర్ల సమన్వయంతో చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్, ఫైనాన్షియల్ లిటరీ స్టాఫ్, ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని రాగి ఇడ్లి, మిల్లెట్ వడ, రాగి జావను పంపిణీ చేశారు.

'అమృత్ భారత్' జాబితాలో జడ్చర్ల రైల్వేస్టేషన్

- మెరుగుపడనున్న మౌళిక సదుపాయాలు



జడ్చర్ల టౌన్: రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, మౌళిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర రైల్వేశాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 40 స్టేషన్లను ఎంపిక చేయగా.. రెండో విడతలో దేశవ్యాప్తంగా మరో 250 స్టేషన్లను ఎంపిక చేశారు. అందులో జడ్చర్లతోపాటు హైదరాబాద్ డివిజన్‌లో షాద్‌నగర్, గద్వాల, మేడ్చల్, కామారెడ్డి రైల్వేస్టేషన్లకు చోటు దక్కింది. పథకంలో భాగంగా రూ.6 వేల కోట్లతో రైల్వేశాఖ ఆయా స్టేషన్లలో మౌళిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది.

ప్రయోజనాలివే..

పథకంలో ఎంపికైన స్టేషన్లకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించనున్నారు. విద్యుత్ దీపాలు మొదలుకొని టాయిలెట్స్, రిటేల్ షాప్స్, ప్లాట్‌ఫాంల విస్తరణ, అనవసర నిర్మాణాలు తొలగించి రోడ్ల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయం, విశ్రాంతి గదులు, బస సౌకర్యాలు వంటివి ఏర్పాటు చేస్తారు. టికెట్ కౌంటర్లు పెంచడం, భద్రత కల్పించడం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా అన్ని సదుపాయాలు కల్పిస్తారు.

అభివృద్ధి ఆస్కారం

దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల అమృత్ భారత్ స్టేషన్‌కు ఎంపిక కావడంతో మరింత అభివృద్ధికి ఆస్కారం ఏర్పడింది. ఈ ప్రాంతంలో ఫార్మ సెజ్ ఉండటం వల్ల వివిధ రాష్ట్రాలకు చెందినవారు నివాసం ఉంటున్నారు. వారికి సైతం అమృత్ భారత్ స్టేషన్ ద్వారా ప్రయోజనం చేకూరనుంది.

15 నుంచి పోలీస్ ఈవెంట్స్

- ఉమ్మడి జిల్లా నుంచి హాజరుకానున్న 6,275 మంది అభ్యర్థులు
- పర్యవేక్షించనున్న ఐపీఎస్ యోగేష్ గౌతమ్, ఎస్పీ నర్సింహ
- వారం రోజులు కొనసాగనున్న దేహదారుఢ్య పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రైం: హైకోర్టు ఉత్తర్వులతో 7 మార్కులు అదనంగా కలిసి ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 21 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో పాలమూరు ఉమ్మడి జిల్లాకు సంబంధించి 6,275 మంది అభ్యర్థులు ఈవెంట్స్‌లో పాల్గొననున్నారు. ఈసారి రేడియో ఫ్రీక్వెన్సీ, సెన్సార్ పద్ధతుల ద్వారా పరుగు పోటీలు, లాంగ్ జంప్, షాట్‌పుట్, ఎత్తు, బరువు, ఛాతి కొలతలు తీసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. రన్నింగ్ ట్రాక్‌తోపాటు గ్రౌండ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు సాగుతున్నాయి. అభ్యర్థుల సర్టిఫికెట్స్ తనిఖీ నుంచి పరీక్షలు పూర్తి చేసుకుని బయటకు వెళ్లే వరకు పోలీస్, అధికారులు సిబ్బంది జాగ్రత్తలు తీసుకోనున్నారు. మొదట అభ్యర్థులు సర్టిఫికెట్స్ పరిశీలన చేసి ఆ కౌంటర్ నుంచి 1600 మీటర్ల పరుగు పోటీ కౌంటర్ దగ్గరికి వెళ్లి పేర్లు పరిశీలించుకుని ఆ తర్వాత పోటీలో పాల్గొనాలి. 1600 పోటీల కోసం ఏర్పాటు చేసిన ట్రాక్‌పై ప్రత్యేక స్కానర్లు, ఎలక్ట్రానిక్ టైమర్ ఏర్పాటు చేయనున్నారు. ఈసారి అభ్యర్థులు మైదానం చుట్టూ నాలుగు రౌండ్లు వేస్తే 1600 మీటర్లు పూర్తవుతుంది. దీనిని గతంలో సిబ్బంది పరిశీలించే వారు కాగా ఈసారి ప్రత్యేకంగా ఏర్పాటు యంత్రాలు ప్రతి అభ్యర్థి టైమింగ్ ఆటోమేటిక్‌గా నమోదు చేస్తోంది.

ప్రత్యేకాధికారుల నియామకం

ఈసారి నిర్వహిస్తున్న కానిస్టేబుల్, ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే జిల్లాకు ప్రత్యేక ఐపీఎస్ అధికారిని యోగేష్ గౌతమ్‌ను కేటాయించారు. గతంలో దేహదారుఢ్య పరీక్షలకు ఐపీఎస్ అధికారి చేతన పర్యవేక్షణ అధికారిగా పనిచేశారు. ఆమె స్థానంలో యోగేష్ గౌతమ్‌ను నియమించారు. ఆయనతోపాటు జిల్లా ఎస్పీ కె.నర్సింహ పర్యవేక్షించనుండగా.. ఏఎస్పీ రాములు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

❒ దేహదారుఢ్య పరీక్షలకు 6,275 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందులో పురుషులు 4,512, మహిళలు 1,763 మంది ఉన్నారు. అలాగే మాజీ సర్వీస్‌మెన్లు 17, ఏటీఓలో పురుషులు 97, మహిళలు 40, టెక్నికల్‌లో 136 పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ఈ నెల 15న 600 మంది అభ్యర్థులకు, 16న 1,040 మంది, 17న మహిళలు 723, పురుషులు 400 మంది, 19న 1,119 మందికి, 20న 1,200 మంది, 21న 1,193 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు.

పెళ్లిసందడి..

కందనూలులో ఒక్కటైన 220 జంటలు

- ఘనంగా సామూహిక వివాహాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: వందలాది ముత్యాల పందిళ్లు.. వేలాదిగా తరలివచ్చిన బంధుమిత్రులు.. పురోహితుల వేదమంత్రాల నడుమ 220 జంటలు ఒక్కటయ్యాయి. జిల్లాకేంద్రంలో మర్రి జంగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి జమున ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సామూహిక వివాహ మహోత్సవ కార్యక్రమం కనులపండువగా జరిగింది. ఒకేసారి 220 జంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెళ్లి పందిళ్లు, పురోహితులతో వివాహాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కె.కేశవరావు, పార్టీ పార్లమెంటరీ పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్ హాజరయ్యారు. ప్రధాన వేదికపై యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించగా.. ప్రధాన వేదికకు ఇరువైపులా 220 జంటలకు వేర్వేరుగా ముత్యాల పందిళ్లు ఏర్పాటుచేశారు. స్వామివారి వేదిక నుంచి ప్రధాన అర్చకులు మంత్రాలను జపించగా.. ప్రతి జంటకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పురోహితులు వివాహాలు జరిపించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రజలందరికీ భోజన సౌకర్యం కల్పించారు.



వధూవరులతో పెళ్లి తంతు జరిపిస్తున్న అర్చకులు

జిల్లావ్యాప్తంగా..

ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వివాహ కార్యక్రమంలో మొత్తం 220 జంటలు ఒక్కటయ్యాయి. వీరిలో 210 జంటలు నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చెందిన వారు కాగా, మిగతా వారు అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ఉన్నారు. సామూహిక వివాహ కార్యక్రమంలో ఓ ముస్లిం జంటతో పాటు మరో క్రిష్టియన్ జంట ఈ వేదిక మీదుగా ఒక్కటయ్యారు.



అప్పగింతల కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్‌లో నిర్వహిస్తున్న ర్యాలీ

గెలిచినా, ఓడినా పెళ్లిళ్లు చేస్తా

తాను సామాజిక కోణంలోనే వివాహాలు చేస్తున్నాను తప్ప రాజకీయాల కోసం కాదని, ఎన్నికల్లో గెలిచినా, ఓడినా సామూహిక వివాహాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. పేదలు ఓ వైపు తాము చేసిన అప్పులు తీర్చేందుకు తిప్పలు పడుతూ మరోవైపు తమ పిల్లల పెళ్లిళ్లు చేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను కళ్లారా చూశానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల బలంతోనే తాను ఇదంతా చేయగల్గుతున్నానని చెప్పారు. కరోనా కాలంలో అనుమతి లేకపోవడంతో సామూహిక వివాహాలు చేపట్టలేకపోయామని, అప్పుడు మిగిలిన సొమ్ముతోనే రూ.9 కోట్లు వెచ్చించి మూడు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించానని చెప్పారు. రూ. 2.50 కోట్ల చొప్పున తాడూరు, సిర్సవాడ, తిమ్మాజిపేట ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మర్రి దంపతులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

భూత్పూర్: మండలంలోని హస్నాపూర్ చెందిన భారతి (35) ఆదివారం హైదరాబాద్‌లోని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. హస్నాపూర్ చెందిన శ్రీను, భార్య భారతి, కుమారుడు రాజు, కూతురు మమతతో కలిసి ఆటోలో ఈనెల 7న మన్యంకొండ జాతర వెళ్లి, 8న తిరిగి వస్తుండగా అమిస్తాపూర్ వద్ద ఆటో వేగంగా నడపడటంతో భారతి ఆటోలో నుంచి కిందపడిపోయింది. దీంతో తలకు తీవ్రగాయాలు కాగా మున్సిపాలిటీలోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దాపూర్‌లో వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన చెన్నకేశవులు(35) కుటుంబ కలహాలతో ఈనెల 2న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికపై బాలుడి అత్యాచారం

పెబ్బేరు: అభంశుభం తెలియని ఐదేళ్ల బాలికపై ఓ బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. వనపర్తి జిల్లా పెబ్బేరులో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పెబ్బేరులోని ఓ కాలనీకి దంపతులు తమ ఐదేళ్ల కూతురిని ఇంటి దగ్గరే ఉంచి శనివారం సంతలో పండ్లు విక్రయించడానికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన స్థానిక బాలుడు(14) బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక సాయంత్రం తల్లి ఇంటికి వచ్చిన తర్వాత పక్కింటి బాలుడి పేరు చెబుతూ ప్రైవేట్ భాగంలో నొప్పి వస్తుందని చెప్పడంతో వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అత్యాచారం జరిగినట్లు ధ్రువీకరించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి విచారణ చేపట్టారు. అనంతరం బాలికను వైద్య పరీక్షల కోసం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసి ఆదివారం బాలుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రాజాపూర్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తిర్మలాపూర్‌లో ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బుర్ర లింగయ్య (56) మూడురోజులుగా కనిపించడం లేదు. ఆదివారం ఉదయం కొందరు కుర్వపల్లెకుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. కుంటలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. బయటికి తీసి పరిశీలించగా లింగయ్యదిగా నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్‌కు రూ.2వేల చొప్పున వసూలు
- పోలీస్‌స్టేషన్‌లో ఇసుక మాయం



అన్నారెడ్డిపల్లి వద్ద ఫిల్టర్ ఇసుక తయారీ..



మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

గండేడ్/మహమ్మదాబాద్: అక్రమ రవాణాకు అడ్డు వస్తే ఇసుకాసురులు ఎంతకైనా వెనుకాడడం లేదు. ఇందుకు అధికారుల అండదండలు సైతం దండిగా ఉండడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో కరుడు గట్టిన ఇసుక మాఫియా వారు ఉన్నారు. ఏళ్ల తరబడి వారు అదే దందా కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖవారిని మచ్చిక చేసుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. మహమ్మదాబాద్ మండలంలోని మహమ్మదాబాద్‌తో పాటు ధర్మాపూర్, లోతువాగు, అన్నారెడ్డిపల్లి, మంగంపేట్, గాదిర్యాల్, గండేడ్ మండలంలోని పగిడ్యాల్, గోవింద్‌పల్లి, రంగారెడ్డిపల్లి, లింగాయిపల్లి నుంచి ప్రతి రోజు ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతుంది. రాత్రి వేళ 20 నుంచి 30 వరకు ట్రాక్టర్లు నడుస్తున్నాయి. టిప్పర్లలో సురారం నుంచి పగిడ్యాల్, సలకర్‌పేట్ మీదుగా తరలుతుంది. హన్వాడ, కోస్గి మండలం సంపల్లి, మల్‌రెడ్డిపల్లి, వికారాబాద్ జిల్లా గుండాల, దాదాపూర్, మల్లెపల్లి, దోమ, పరిగి ప్రాంతాలకు ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. ఒక్కో ట్రిప్పు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు.

ట్రాక్టర్‌కు రూ.2వేలు వసూలు..

ఇసుక అక్రమ రవాణాకు పోలీసుశాఖలో కొందరు

అడ్డుకుంటే దాడులు..

➡ మంగంపేటకు చెందిన రైతులు రాంరెడ్డి, నర్సింహారెడ్డి పొలం అన్నారెడ్డిపల్లి శివారులో ఉంది. కొంతకాలంగా వీరి పొలం కింద వాగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతులు శుక్రవారం అడ్డుకున్నందుకు వారిపై ఇసుక వ్యాపారి కూలీలతో కలిసి దాడులకు తెగబడ్డారు.

➡ గతంలో కంచన్‌పల్లి చెందిన శ్రీకృష్ణ మహమ్మదాబాద్ నుంచి ఇంటికి వెళ్తుండగా వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని తప్పుదోవ పట్టించడానికి యత్నించారు. అప్పట్లో పోలీసులు అక్రమార్కులకు వంత పాడారు. దీంతో బాధితులు రోడ్డుపై శవంతో ఆందోళన చేపట్టారు. చివరకు ఎమ్మెల్యే జోక్యంతో ఇందుకు కారకులైన వారిపై కేసులు నమోదయ్యాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు నిత్యం సంఘటనలు పునరావృతం అవుతున్నాయి.

వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పదిహేను రోజులకో, నెలకో ఒప్పందం కుదుర్చుకొని ఎంతో కొంత తీసుకొని వ్యవహారం కొనసాగించేవారు. ఇప్పుడు నిబంధనలు మారాయి. రోజుకు ఒక్కో ట్రాక్టరుకు రూ.2వేల చొప్పున ఇవ్వాలని ఆదేశించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మీరు ఎన్ని ట్రిప్పులు అయినా తీసుకుపోండి కానీ రోజుకు రూ.2వేలు ఇవ్వాల్సిందేనని తన అనుయాయుల ద్వారా సదరు అధికారి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఒక్క ట్రాక్టర్‌పై కూడా కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.

కొనసాగుతున్న ఇసుక ఫిల్టర్లు..

మహమ్మదాబాద్ మండలంలోని ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి, అన్నారెడ్డిపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో ఇసుక ఫిల్టర్లను కొనసాగిస్తున్నారు. చెరువులు, వాగుల్లో నీళ్ల ఉండడంతో ముందే నిల్వ చేసుకున్న ఇసుకతో పాటు కృత్రిమ ఇసుక తయారీకి అక్రమార్కులు శ్రీకారం చుట్టారు. వీటి నిర్వహణ నిబంధనలకు విరుద్ధం అయినా అధికారుల పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇది నిర్మాణాలకు అంత శ్రేయస్కరం కాదు. రెవెన్యూ అధికారులు కూడా స్పందించకపోవడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నిర్లక్ష్యపు డ్రైవింగ్..

అధికారుల అండతో ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. దీంతో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ల వేగానికి అడ్డు అదుపు లేదు. ఇసుక లోడుతో రాకెట్ వేగంతో గమ్య స్థానాలకు చేరుతున్నాయి. కనీసం వెనకాల వచ్చే వాహనాలకు వీరు దారి ఇవ్వడం లేదు. ట్రాక్టర్ల మోతకు పరిసర గ్రామస్తులకు కంటిమీద కునుకు కూడా కరువవుతుంది.

పట్టుబడిన ఇసుక మాయం?

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. జరిమానా విధించిన అనంతరం ఇసుకను అక్కడే ఖాళీ చేసి ట్రాక్టర్లను పంపించారు. ఇలా జమ అయిన ఇసుక నాలుగు, ఐదు లారీల వరకు ఉన్నట్లు సమాచారం. అయితే ఇది గుట్టు చప్పుడు కాకుండా మాయమైంది. మహమ్మదాబాద్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల సహకారంతో ఇసుకను తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. పరిశుభ్రత పేరుతో దీన్ని ఇక్కడి నుంచి తరలించినట్లు తెలుస్తుంది. ఇది జరిగి చాలా రోజులు కావస్తున్న బయటకు పొక్కకుండా పకడ్బందీగా వ్యవహరించారు. దీంతో పాటు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి జరిమానా వేయకుండా, ఇసుక కూడా ఖాళీ చేయకుండా వదిలివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోలీసులు స్పందించడం లేదు



మా పొలం ఆనుకునే వాగు ఉంది. కొంతకాలంగా రాత్రివేళల్లో ఇసుక తీస్తున్నారు. దీనివల్ల బోర్లలో నీరు తగ్గడంతో పాటు పొలం కూడా కోతకు గురవుతుంది. దీనిపై నేను, మానాన్న వెళ్లి ఇసుక తీసుకెళ్లడాన్ని అడ్డుకున్నాం. వారు మాపై దాడికి దిగారు. ట్రాక్టర్లు ఖాళీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చే శాం. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వేచి చూసినా స్పందించలేదు. కనీసం పిలిపించి మాట్లాడలేదు. ఈ విషయంపై ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం.

– నర్సింహారెడ్డి, రైతు, మంగంపేట్

కఠిన చర్యలు తీసుకుంటాం..



గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణ కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి ఎవరికి అనుమతులు లేవు. కలెక్టర్ అనుమతి ఇస్తే తప్ప తాము ఇవ్వం. అక్రమ రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి రాలేదు. ఇకపై నిఘా ఉంచుతాం. పోలీసులను కూడా అప్రమత్తం చేస్తాం. ఫిల్టరు ఇసుక తయారు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తాం.

– అంజనేయులు, తహసీల్దార్, మహమ్మదాబాద్

ఆరోపణలు అవాస్తవం..



ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారడంలో వాస్తవం లేదు. గిట్టని వారు చేస్తున్న అసత్య ప్రచారాలు ఇవి. తాము ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేయడం లేదు. ఇసుక రవాణాపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. దాడులకు పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేస్తాం. పోలీస్‌స్టేషన్ వెనకాల పొదలు పెరిగితే శుభ్రం చేయించాం. అక్కడి నుంచి ఇసుక తరలింపు కాలేదు.

– సైదయ్య, ఎస్‌ఐ, మహమ్మదాబాద్

గడ్డివాము దగ్ధం



కాలిపోయిన గడ్డివాము

మాగనూర్: మండలంలోని పర్మన్‌దొడ్డిలో ఆదివారం ప్రమాదవశత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే రైతు గ్రామ సమీపంలో పశువుల మేత కోసం గడ్డివాము నిల్వ చేసుకున్నాడు. గడ్డివాము నుంచి ఆకస్మికంగా మంటలు రావడంతో గ్రామస్తులు గుర్తించి సదరు రైతుకు సమాచారం అందించారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. రూ.60వేల విలువ చేస్తే గడ్డి కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మల్లేపల్లిలో..



ఊట్కూరు: మండలంలోని మల్లేపల్లిలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చాపల కిష్టయ్య గ్రామ శివారులో పశుగ్రాసాన్ని నిల్వచేశారు. మధ్యాహ్నం పశుగ్రాసానికి నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల పొలాల రైతులు, కూలీలు గుర్తించి వెంటనే కిష్టయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన నారాయణపేట అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా వారు వచ్చి మంటలు ఆర్పారు. రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, రెండు ట్రాక్టర్ల వరిగడ్డి కాలి బూడిదైందని.. రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

సారా స్వాధీనం

బల్మూర్: మండలంలోని అచ్చంపేట–బల్మూర్ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనంపై నిషేధిత నాటుసారాను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. గోపాల్‌రావునగర్‌తండాకు చెందిన తిరుపతయ్య అనే వ్యక్తి అచ్చంపేటకు సారాను తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పట్టుకొని 7లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడి మృతిపై ఆందోళన

- వైద్యురాలి నిర్లక్ష్యమేనని రోడ్డుపై భైఠాయించిన బాధితులు



మృతిచెందిన బాలుడితో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

అచ్చంపేట: గుండె సంబంధిత వ్యాధితో విశ్వనాయక్ (11)నెలల బాలుడు మృతిచెందిన సంఘటన నల్లమలలో చోటుచేసుకుంది. అచ్చంపేట దేవి ఆస్పత్రికి చెందిన వైద్యురాలు నిర్లక్ష్యం, సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే 11నెలల బాలుడు మృతిచెందాడని ఆరోపిస్తూ ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బాధితులు భైఠాయించి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. 2గంటల అనంతరం బాధితులు దేవి ఆస్పత్రి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో పోలీసులు అడ్డగించి, బాధితులతో మాట్లాడారు. బాధితుల కథనం ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన రామావత్ సరిత రాజ్యా(రాజు)లకు 11నెలల కిందట బాలుడు జన్మించాడు. గుండెకు సంబంధించి రంధ్రం మూసుకపోయిన విషయం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లితే తెలిసిందని, గర్భవతి అయినప్పటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకుంటే ఏరోజు కూడా ఇక్కడ చెప్పలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయం తెలిసిన వెంటనే 7నెలల కిందట అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో వైద్యురాలుపై ఫిర్యాదు చేయగా, తనపై సీఐ, ఎస్‌ఐలు దుర్భాషలడారని, ఎవరూ మా గురించి పట్టించుకోలేదని తెలిపారు. దీంతో బాలుడు మృతిచెందడం వల్లే రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలుడు మృతికి కారణమైన దేవి ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆడిషనల్ డీఎంహెచ్‌ఓ తారాసింగ్ బాధితులు ఆందోళన చేస్తున్న అంబేద్కర్ చౌరస్తాకు వచ్చి ఇందుకు సంబంధించిన వివరాలు అందాయని, గైనాకాలిస్టు, రెడియాలిస్టు, స్కానింగ్‌కు సంబంధించిన వైద్యులతో మాట్లాడి నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం, నలుగురికి తీవ్రగాయాలు
- కడప జిల్లా ఒంటిమిట్ట సమీపంలో ఘటన



బత్తుల వంశీ (ఫైల్)



నరేందర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం/ భూత్పూర్: కుటుంబ సభ్యులతో దైవదర్శనానికి సంతోషంగా బయలుదేరిన ఆనందం మధ్యలోనే ఆవిరైంది. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన బత్తుల వంశీ(27), భార్య బింధుతోపాటు వాళ్ల బంధువులు హస్నాపూర్‌కు చెందిన నరేందర్(21), బోయపల్లికి చెందిన రాము, హన్మంతు, కృష్ణవేణి, వెంకటేష్‌లతో కలిసి శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అద్దెకు కారు తీసుకుని అమిస్తాపూర్ నుంచి తిరుపతికి ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మంగంపేట శివారులో కడప– రేణిగుంట జాతీయ రహదారిపై రాజంపేట్ వైపు నుంచి వస్తున్న లారీ, తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న బత్తుల వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను కడప రిమ్స్‌కు తరలించారు. ముందు సీటులో కూర్చున్న నరేందర్‌కు తీవ్ర గాయాలు కాగా బింధుకు చెయ్యి, కాలు విరిగిపోయాయి. రాము, హన్మంతు, కృష్ణవేణి గాయపడటంతో వారిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ నరేందర్ మృతి చెందాడు. కారులో ఉన్న వెంకటేష్‌కు మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. బత్తుల వంశీకి ఏడాదిన్నర కిందటే పెళ్లి కాగా.. ఇటీవలే భార్యాభర్తలు తిరుపతి వెళ్లివచ్చారు. మరోసారి బంధువులతో కలిసి వెళ్లాలని భావించి కారును అద్దెకు తీసుకుని వెళ్లారు. బత్తుల వంశీ ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ: ఓ మహిళ మృతి

- 8 మందికి తీవ్రగాయాలు
- పెళ్లి వస్త్రాలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

పెద్దకొత్తపల్లి: ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందగా.. మరో 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దకొత్తపల్లి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్య కథనం ప్రకారం.. లింగాల మండలం అవుసలికుంటకు కొందరు ఆదివారం నాగర్‌కర్నూల్‌కు వచ్చి పెళ్లి వస్త్రాలు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే కొందరు నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకొని వస్తుండగా.. పెద్దకొత్తపల్లి శివారులో రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిట్టెమ్మ(40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108లో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి ..

బాలానగర్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రాజాపూర్ మండలంలోని బచ్చిరెడ్డికుంట తండాకు చెందిన దశరథ్ నాయక్ (35) తన ద్విచక్ర వాహనంపై రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని బూర్గుల వెళ్లి తిరిగి వస్తున్నాడు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఓ కారు ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆడ దూడలకు బ్రూసెల్లాసిస్ వ్యాక్సిన్

- ఎద సమయంలో గర్భస్రావం కాకుండా ముందు జాగ్రత్త
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రక్రియ
- ఇప్పటి వరకు 13,207 దూడలకు టీకా



భూత్పూర్‌లో దూడకు బ్రూసెల్లాసిస్ వ్యాక్సిన్ వేస్తున్న గోపాలమిత్ర

మహబూబ్‌నగర్(వ్యవసాయం): ప్రజావసరాలకు తగ్గట్టు పాల ఉత్పత్తిని పెంచేందుకు పశుసంవర్ధక శాఖ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. ఎదకు వచ్చిన బర్రెలకు గోపాలమిత్రల ద్వారా ఏఐ వ్యాక్సినేషన్ ప్రక్రియను నిరంతరం చేపడుతుండగా.. తాజాగా ఆడ దూడలకు బ్రూసెల్లాసిస్ టీకా అందిస్తుంది. సూడి సమయంలో పశువుల్లో గర్భస్రావాన్ని నిరోధించేందుకు ముందస్తుగానే 4 నుంచి 8 నెలల వయసు ఉన్న బర్రె, ఆవు దూడలకు గత నెల 30 నుంచి ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 16,040 దూడలను గుర్తించి, ఇప్పటి వరకు 13,207 దూడలకు అందించింది. టీకా ఇచ్చిన వెంటనే వాటి చెవికి పోగు వేసి, యాప్‌లో వివరాలు నమోదు చేస్తుంది. ఈ నెల 20వ తేదీ నాటికి వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయనున్నారు. పశువుల్లో గర్భస్రావం సమస్యకు చెక్ పడనుండటంతో ఆర్థికంగా నష్టం తప్పుతుందని పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బ్రూసెల్లా..

ఇది పశువుల్లో సోకే అంటు వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువులు ఈడ్చుకుపోవడం లేదంటే కట్టకుండా ఉండటం జరుగుతుంది. అంతేకాకుండా వ్యాధి సోకిన పశువులు మేకలు, గొర్రెలకు కూడా పూస్తాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం మూడేళ్లుగా బ్రూసెల్లా టీకాలను పశుసంవర్ధక శాఖ యంత్రాంగంతో ఉచితంగా ఇస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం జనవరి 31న ప్రారంభించిన ప్రభుత్వం ముమ్మరంగా కొనసాగిస్తుంది.

13,207 పశువులకు టీకా..

జిల్లా వ్యాప్తంగా 16,040 పశువులు ఉండగా.. అందులో ఇప్పటి వరకు 13,207 పశువులకు ఈ టీకాను ఇంటి దగ్గరకు వెళ్లి వేశారు. టీకా వేసిన అనంతరం ఆ పశువుకు చెవిపోగు వేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పెద్దవాటికి ఈ వ్యాక్సిన్ వేస్తే ఉపయోగం ఉండనందున 3 నుంచి 8 నెలల వయసున్న పశువులకు మాత్రమే వేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ వేసే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఈ ప్రక్రియ వేగం పెంచారు.

రైతులకు ఎంతో మేలు

వ్యాక్సిన్ వేయడంతో రైతులకు మేలు జరుగుతుంది. ఇటీవల చాలా వరకు రైతులు మేలు జాతి పశువులను ఎక్కువగా సాకుతున్నారు. అందులో జెర్సీ, హెచ్‌ఎస్, గీర్, ఒంగోలు, ముర్ర జాతులు ఉన్నాయి. ఈ వ్యాక్సిన్ వేయడంతో ఈ రకాలు పెద్ద ఎత్తున ఉత్పత్తి కానున్నాయి. తద్వారా రైతులకు ఆర్థిక పరిపుష్టి మరింత లభించనుంది. పాల ఉత్పత్తులు సైతం పెరగనున్నాయి.

వ్యాక్సిన్‌తో ప్రయోజనాలు..

మూడేళ్ల తర్వాత పశువులు ఎదకు వస్తాయి. ఈ క్రమంలో 7, 8, 9 నెలల్లో కొన్నింటికి గర్భస్రావం అవుతోంది. దాంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. మరో ఏడాది పాటు పాల ఉత్పత్తికి దూరంగా ఉండాల్సి వస్తుంది. దీనికి తోడు పశు సంపద కూడా తగ్గుతుంది. వీటన్నింటిని అధిగమించి రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను పశువులకు అందిస్తుంది. పశువైద్యాధికారులు పశువుల దొడ్ల వద్దకు వచ్చి ఆడ దూడలను గుర్తిస్తున్నారు. తర్వాత వాటికి వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నారు. మరో కొన్ని రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

వారం రోజుల్లో టీకా ప్రక్రియ ముగింపు



4 నుంచి 8 నెలల వయసున్న పశువులకు బ్రూసెల్లా టీకాను వేస్తున్నాం. మరో వారం రోజుల్లో ఈ కార్యక్రమం ముగుస్తుంది. పశువులకు బ్రూసెల్లా రోగం వస్తే అవి ఈడ్చుకుపోవడంతో పాటు కట్టకుండా పోతాయి. పైగా ఈ వ్యాధి ఇతర పశువులకు, జీవాలకు కూడా సోకే ప్రమాదం ఉంది. పాడి రైతులు కూడా ఆ వయసున్న పశువులకు టీకా వేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఆర్టీసీ బస్సు బోల్తా



ఘటన స్థలంలో బస్సు

కొత్తకోట: ఆర్టీసీ బస్సు బోల్తాపడి 15 మంది గాయాలపాలైన ఘటన 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట డిపోకు చెందిన లగ్జరీ బస్సు 37 మంది ప్రయాణికులతో శనివారం సాయంత్రం యాదగిరిగుట్ట నుంచి తిరుపతికి బయలుదేరింది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొత్తకోట సమీపంలోని మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న లారీని దాటబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

క్లుప్తంగా...

'కొత్తపల్లె' కరెంటు బిల్లు.. రూ. 11.41 కోట్లు!

- కొత్త పంచాయతీకి విద్యుత్ షాక్



మాచారెడ్డి: ఇటీవల పంచాయతీల పునర్విభజనలో కొత్త పంచాయతీగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లె పంచాయతి భవనానికి రూ. కోట్లలో వచ్చిన కరెంటు బిల్లును చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. పంచాయతీ వాటర్ వర్క్స్‌కు సంబంధించిన సర్వీస్ నంబర్ 3801-02321పై ఈనెల 3న ట్రాన్స్‌కో బిల్లింగ్ సిబ్బంది మీటర్ రీడింగ్ నమోదు చేశారు. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 3 వరకు 1,88,15,257 యూనిట్లు వాడినట్టు పేర్కొన్నారు. దీనికి ఏకంగా రూ. 11,41,63,672 బిల్లు విధించారు. ఏసీడీ డ్యూ కింద మరో రూ.8,716 వడ్డించారు. ఈనెల 17 లోపు బిల్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ బిల్లును చూసిన సర్పంచ్, పంచాయతీ సిబ్బంది షాక్‌కు గురయ్యారు. గతనెల విద్యుత్ బిల్లు రూ.3,257 వచ్చిందని సర్పంచ్ తెలిపారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సాంకేతిక సమస్యతో బిల్లు ఇలా వచ్చిందని చెప్పారు.

కరెంటు బిల్లు అంటూ దోచేస్తారు..

వినియోగదారులను అప్రమత్తం చేస్తున్న ఎన్పీడీసీఎల్

జనగామ: 'మీ విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది.. చెల్లించకుంటే కరెంటు కట్ చేస్తాం'అంటూ అపరిచిత వ్యక్తులు వ్యాపార, వాణిజ్య, గృహ వినియోగదారుల వద్దకు వస్తున్నారని, వారిపట్ల అప్రమత్తతతో ఉండాలని ఎన్పీడీసీఎల్ అధికారులు జనగామలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీ ఫుటేజీల్లో రికార్డయిన సదరు వ్యక్తి ఫొటోను సైతం సంస్థ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ... వినియోగదారులను హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు వచ్చి కరెంటు బిల్లు కట్టాలని అడిగితే స్పందించవద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు.. ఓటీపీతో నగదు చోరీ.. ఇలా సాంకేతికతను ఆసరా చేసుకుని డబ్బులు స్వాహా చేస్తున్న నేరగాళ్లు.. ఇప్పుడు కొత్తగా కరెంటు బిల్లుల పేరిట ఊళ్లమీద పడటంతో ఎన్పీడీసీఎల్ సంస్థ ముందస్తుగా అప్రమత్తమైంది.

కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు

ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మార్గనిర్దేశంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులైన జస్టిస్ నజీర్ అనుభవం ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో, రాష్ట్రానికి చక్కటి మార్గనిర్దేశం చేయడంలో ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. ఇప్పటి దాకా రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించిన విశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. మచ్చలేని వ్యక్తిత్వం హరిచందన్ సొంతమని పేర్కొన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులను దాటుకుని రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఆయన మరువలేని సహకారాన్ని అందించారని చెప్పారు. అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందాతనంతో వ్యవహరించారని, అత్యుత్తమ రాజకీయ పరిణతి చూపించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంలో, వాటి మధ్య సంబంధాలు సజావుగా సాగడంలో అత్యంత కీలక పాత్ర పోషించి, రాజ్యాంగానికి వన్నె తెచ్చారన్నారని ముఖ్యమంత్రి జగన్ కొనియాడారు. తండ్రి తరహాలో వాత్సల్యాన్ని చూపారని, తెలుగు ప్రజలకు ఆత్మీయతను పంచారని ప్రశంసించారు. రాష్ట్రం నుంచి ఆయన వెళ్లిపోవడం బాధాకరమైనా, దేశంలో మరో రాష్ట్రానికి ఆయన గవర్నర్‌గా వెళ్లడం అక్కడి ప్రజలకు తప్పకుండా మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు.



సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తికి పురస్కారం అందజేస్తున్న జూలూరి గౌరీశంకర్. చిత్రంలో అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి



కుప్పిలి పద్మకు పురస్కారం అందజేస్తున్న సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి

లోపాలను ప్రశ్నించిన వ్యక్తి.. అరుణ్‌సాగర్

- విశిష్ట పురస్కారాల ప్రదాన సభలో వక్తలు
- సీనియర్ పాత్రికేయుడు రామచంద్ర మూర్తికి జీవన సాఫల్య పురస్కారం
- కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారం

భద్రాచలంటౌన్: ఎప్పుడైనా, ఎక్కడైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పి వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే తత్వం ఉన్న వ్యక్తి అరుణ్ సాగర్ అని పలువురు సీనియర్ పాత్రికేయులు చెప్పారు. అరుణ్‌సాగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం భద్రాచలంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తికి జీవన సాఫల్య పురస్కారం, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. మరణం తర్వాత జీవించి ఉన్న అరుదైన వ్యక్తుల్లో అరుణ్ సాగర్ ఒకరని, ఏడేళ్లుగా ఆయనను తలచుకుంటూనే ఉన్నామన్నారు. సీనియర్ జర్నలిస్టులకు గురువులాంటి వ్యక్తి రామచంద్రమూర్తిని అరుణ్‌సాగర్ అవార్డుతో సన్మానించుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. ఆధునిక రచన, కవితా శైలికి కుప్పిలి పద్మ ఉదాహరణ అని పేర్కొన్నారు.

కవిత్వంలో తన తరం వాళ్లకంటే ముందే...

సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. అల్లూరి, కొమురం భీమ్ తరహాలో గిరిజన ప్రాంతమైన భద్రాచలం నుంచి వచ్చిన అరుణ్‌సాగర్ నిర్వాసిత గిరిజనుల జీవితాన్ని తన రచనల్లో చూపారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఎదిరించే తత్వం ఈ గడ్డ నుంచే మొదలైందని, ఆనాడు భక్త రామదాసు తానీషాను ఎదిరించి రాముడి గుడి నిర్మించాడని గుర్తుచేశారు. ఈ గడ్డపై పుట్టిన అరుణ్‌సాగర్‌ది కూడా ఎదిరించి నిలిచే తత్వమని గుర్తు చేసుకున్నారు. అనంతరం సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి మాట్లాడుతూ.. తన తరం జర్నలిస్టుల్లో అరుణ్‌సాగర్ అత్యంత ప్రతిభావంతుడని, అదేవిధంగా కవిత్వంలో తన తరం వాళ్లకంటే ఎంతో ముందుండేవారని కొనియాడారు. తెలుగు పత్రికా రంగాన్ని ప్రజల పక్షం చేయడంలో ఏబీకే ప్రసాద్ తర్వాత పేర్కొనదగిన వ్యక్తి కె. రామచంద్రమూర్తి అని అన్నారు. సాహిత్య రంగానికి కుప్పిలి పద్మ ఎంతో సేవ చేశారని చెప్పారు. ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా అరుణ్ సాగర్ జ్ఞాపకాలను మరోసారి గుర్తు తెచ్చుకున్నామని రామచంద్రమూర్తి అన్నారు. అరుణ్‌సాగర్ కవితలు తన తరం, ఆ తర్వాత వారికి దిశానిర్దేశం చేస్తాయని కుప్పిలి పద్మ చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న, సంపాదకుడు కె.శ్రీనివాస్, మువ్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. జస్టిస్ అబ్దుల్ నజీర్ కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెళువాయికానాలో 1958 జనవరి 5న జన్మించారు. ఈ పట్టణం మంగళూరుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మూడబిద్రిలోని మహావీర్ కాలేజీలో బీకాం, మంగళూరులోని ఎస్‌డీఎం లా కాలేజీలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1983లో కర్ణాటక హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003 మే 12న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం పూర్తి స్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాక 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. మూడో స్థానంలో ఉన్న న్యాయమూర్తి ఏ హైకోర్టులోనూ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టకుండా నేరుగా సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందడం అదే తొలిసారి. 2023 జనవరి 4న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందారు. ఆ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో జస్టిస్ అబ్దుల్ నజీర్ గురించి సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. 'జస్టిస్ అబ్దుల్ నజీర్ సౌమ్యుడు, సామాన్యుడు. ఇటీవలి వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా న్యాయమూర్తి కార్డును గుర్తింపు కార్డుగా ఉపయోగించారు. 2019లో పాస్‌పోర్టు తీసుకున్నారు. అదీ అత్యవసరంగా మాస్కో వెళ్లాల్సివచ్చినపుడు తీసుకున్నారు. పాస్‌పోర్టుపై తొలిస్టాంపు అదే' అని వ్యాఖ్యానించారు.

కీలక ధర్మాసనాల్లో బాధ్యతలు

జస్టిస్ అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టులో పలు కీలక ధర్మాసనాల్లో న్యాయమూర్తిగా పని చేశారు. 2017లో ట్రిపుల్ తలాక్ కేసులో ఏకైక ముస్లిం న్యాయమూర్తిగా ఉన్నారు. ఐదుగురు న్యాయమూర్తులున్న ఈ ధర్మాసనంలో ముస్లిం షరియా చట్టం ప్రకారం ట్రిపుల్ తలాక్ ఆచరణకు అనుమతి ఉందని జస్టిస్ నజీర్ తన తీర్పులో పేర్కొన్నారు. 3:2తో ట్రిపుల్ తలాక్ చెల్లదని ఆ ధర్మాసనం తీర్పు చెప్పిన విషయం విదితమే. 2019లో అయోధ్య రామ మందిరం కేసులోనూ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు. వివాదాస్పద ప్రాంతంలో హిందూ నిర్మాణం ఉనికి గురించి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్న విషయాన్ని జస్టిస్ నజీర్ సమర్థించారు. రామ మందిరానికి అనుకూలంగా తీర్పునిచ్చారు. పదవీ విరమణకు ముందు రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ నజీర్ పెద్దనోట్ల రద్దు సహా పలు కేసులు విచారించారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి

భద్రాచలం పాదయాత్రకు భట్టి

సాక్షి, హైదరాబాద్: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఈనెల 14న భద్రాచలం నియోజకవర్గంలో జరిగే పాదయాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారు. ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ పాదయాత్ర 14న భద్రాచలం చేరుకుంటుందని టీపీసీసీ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. 15 నుంచి వరంగల్ పార్లమెంటరీ నియోజక వర్గం పరిధిలో యాత్ర సాగుతుందని, 15న పాలకుర్తి, 16న వర్ధన్నపేట, 17న స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే యాత్ర లో రేవంత్ పాల్గొంటారని పేర్కొన్నాయి.

టీడీపీ గూండాల బరితెగింపు



వడ్డాది రమణ

వించిపేట (విజయవాడ పశ్చిమ): ఏపీలో టీడీపీ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయింది. తమ కుటుంబంలోని మహిళను ఎందుకు వేధించారని ప్రశ్నించిన పాపానికి విజయవాడలో టీడీపీ నేత ఒకరు ఏకంగా 20 మందికి పైగా అనుచరులతో కలిసి.. కత్తులతో ఆ మహిళ కుటుంబంపై విచక్షణ రహితంగా దాడి చేయడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలిచింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నగరంలోని 55వ డివిజన్ (వించిపేట) టీడీపీ అధ్యక్షుడు వడ్డాది రమణ తమ్ముడు వడ్డాది నరేశ్ నెల రోజులుగా ఓ వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం బయటకు వెళ్తున్న ఆమెపై చేతులు వేసి, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా ఆమె అత్త, మామ, మరిది కలిసి టీడీపీ నాయకుడు వడ్డాది నరేశ్ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ నేతలు రమణ, నరేశ్ ఇంటి వద్ద లేరు. జరిగిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెప్పి.. మరోసారి ఇలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బాధితులు తమ ఇంటి వద్దకు వచ్చి వెళ్లారనే విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు వడ్డాది రమణ, నరేశ్.. 20 మంది అనుచరులతో కలిసి వివాహిత ఇంటిపైకి దాడికి వెళ్లారు. 'మా ఇంటికే వచ్చి హెచ్చరిస్తారా.. మీకెంత ధైర్యం.. ఇప్పుడు మీకు ఎవరు అడ్డువస్తారో చూస్తాం..' అని తిడుతూ వివాహిత మామ ఏడుకొండలు, అత్త భారతి, మరిది అరుణ్‌కుమార్‌తో పాటు మరో యువకుడు హేమంత్‌పై కత్తులతో దాడి చేశారు. అరుణ్‌కుమార్‌కు పొత్తి కడుపులో, మిగలిన వారి ఒంటిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు వడ్డాది రమణ, వడ్డాది నరేశ్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు.

నేడు అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ హెచ్ఐ కేటగిరీలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల లోపు రిపోర్ట్ చేసిన వారిని పరిగణనలోకి తీసుకుంటామని విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక్కడి పరిపాలన భవనంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్వీకే రెడ్డి వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్‌కు కావాల్సిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష రాసి అందులో ర్యాంకు పొందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని స్పష్టంచేశారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

నల్లమలలో చెలరేగిన మంటలు



అమ్రాబాద్: నల్లమల అడవి ప్రాంతంలో మాచారం బీట్ పరిధిలోని కండ్లకుంట సమీపంలో ఆదివారం రాత్రి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫారెస్టు ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. ఐదు హెక్టార్ల లోపు అడవి కాలినట్లు ఎఫ్ఆర్ఓ ప్రభాకర్ తెలిపారు. పశువుల కాపరులు వేసిన నిప్పు వల్లే కాలినట్లు ఎఫ్ఆర్ఓ అభిప్రాయం వ్యక్తం చేశారు.

రైతులపై వేధింపులు మానుకోండి



మన్ననూర్: బ్యాంకు రుణాల పేరుతో సహకార బ్యాంకు అధికారులు రైతులను వేధించడాన్ని తక్షణమే మానుకోవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మన్ననూర్‌లోని గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు అమ్రాబాద్, పదర మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో నిజనిర్ధారణ చేపట్టారు. 2018లో జిల్లా సహకార సంఘం పేరుతో కొంతమంది పైరవీకారులు, అధికారులతో కుమ్మక్కై అమ్రాబాద్‌లోని మాధవానిపల్లి, కల్మూలోనిపల్లి, తెలుగుపల్లి, కొత్తపల్లి, ఉడిమిళ్ల, మాచారం, వంకేశ్వరం, ఇప్పలపల్లి, మారడుగు గ్రామాలకు చెందిన సుమారు 70 మంది రైతులకు రుణాలు ఇప్పిస్తామని ఆశ చూపారని, వారి పేరిట రూ.4లక్షలు బ్యాంకులో అప్పు తీసుకుని, రైతులకు మాత్రం ఒకటి, రెండు లక్షలే ఇచ్చారని అన్నారు. బ్యాంకు రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందని నమ్మబలికినట్టు రైతులకు చెప్పారని, ఇప్పుడు వడ్డీతో కలిపి రూ.7లక్షలు తిరిగి బ్యాంకుకే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వెంటనే చెల్లించాలంటూ రైతుల ఇళ్లపై బ్యాంకు అధికారులు దాడులకు దిగుతున్నారని తెలిపారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఏళ్ల కిందట తీసుకున్న రుణం గురించి ఎన్నడూ అడగని అధికారులు, ఆకస్మికంగా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

చౌక డీలర్లకు ఈ-పాస్

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద అమలు



గోదాంకు వెళ్లాల్సిందే..



వచ్చే నెల నుంచి డీలర్లు ఎంఎల్ఎస్ కేంద్రాలకు వచ్చి బయోమెట్రిక్‌తో బియ్యం తూకం చేసుకొని తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ నెలకు సంబంధించి ఇప్పటికే కొందరు డీలర్లకు బయోమెట్రిక్‌తో బియ్యం సరఫరా చేశాం. పంపిణీలో కాస్త జాప్యం జరుగుతున్నందున ప్రభుత్వం ఈ నెల స్టాక్‌ను బయోమెట్రిక్ లేకుండా సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

– బాలరాజు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

మహబూబ్‌నగర్ రూరల్: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. తాజాగా డీలర్లకు ఈ-పాస్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. డీలర్లు గోదాముల వద్ద వేలిముద్ర వేస్తేనే నెలవారీ కోటా అందించాలని నిర్ణయించింది.

- చౌక దుకాణాల్లో ఉన్న అస్తవ్యస్త వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం గాడిలో పెడుతూ వస్తోంది. డీలర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే ఐరిష్ విధానాన్ని తీసుకొచ్చింది. జిల్లాలోని అన్ని చౌకధర దుకాణాలకు బియ్యాన్ని ఎంఎల్ఎస్ కేంద్రాల నుంచి లారీల్లో పంపిస్తుండగా.. ప్రతినెల తక్కువగా వస్తున్నాయని, 50 కిలోల బస్తాలో 45 కిలోల నుంచి 49 కిలోల మధ్యలోనే ఉంటున్నాయని డీలర్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. గోదాముల్లోని గన్నీ సంచులకు కావాలనే రంధ్రాలు చేసి బియ్యం కిందపోయేలా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం సేవలో మరింత పారదర్శకత కోసం డీలర్లకు కూడా ఈ-పాస్‌ను అమలు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇక నుంచి డీలర్లు నెలవారీ కోటా కోసం గోదాంకు వెళ్లాల్సిందే. వేలి ముద్ర వేయాల్సిందే.

జిల్లాలో ఇలా..

చౌకధర దుకాణాలు	506
ఆహార భద్రత కార్డులు	2,20,644
అన్నపూర్ణ కార్డులు	205
అంత్యోదయ కార్డులు	18,887
ప్రతి నెల పంపిణీ చేసే బియ్యం 4393.390 (ఎంటీఎస్)	

ఈ నెల మినహాయింపు..

ఎంఎల్ఎస్ కేంద్రాల్లో డీలర్ల బయోమెట్రిక్ విధానం అమలులో సమస్యలు తలెత్తాయి. పరిష్కరించి పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ నెల బియ్యం సరఫరాలో బయోమెట్రిక్‌కు మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎట్టకేలకు తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా నీటి విడుదల

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు ఆదివారం నీటి విడుదల చేశారు. వారం రోజులకు పైగా పంపు నడవకపోవడంతో ఆర్డీఎస్ ఆయకట్టు కింద మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు ఆందోళన చేస్తున్న క్రమంలో అధికారులు తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా నీరు వదలడం రైతులకు కొంత ఊరట కలిగించింది. పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కూడా శనివారం లిఫ్టు వద్ద ధర్నా చేసిన సంగతి విధితమే. ఈక్రమంలో ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో అధికారులు తుమ్మిళ్ల మెటార్‌ను ఆన్ చేశారు. కాగా మోటార్ ఆన్ చేసేందుకు సరిపడే నీరు నదిలో లేని కారణంగా నీరు ఇవ్వడం లేదని అధికారులు చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన ఇండెంట్ ఏపీ వాళ్లు వాడుకోవడంతో మనకు వాటా లేక ఆర్డీఎస్ కు నీరు ఇవ్వలేదు. తుమ్మిళ్ల మోటార్ ఆన్ చేయాలంటే 291.5 పాయింట్ల ఎఫ్ఆర్ఎల్ ఉండాలని తెలిపారు.



డి-24 వద్ద ఆర్డీఎస్ కెనాల్‌లో విడుదలవుతున్న తుమ్మిళ్ల నీరు

ఆ స్థాయి నీరు లేక మోటార్ రన్ చేయలేదు. శనివారం నుండే తుమ్మిళ్ల లిఫ్టు కోసం అధికారులు ఏపీ అధికారులతో మాట్లాడటంతో వారికి కేసీ కెనాల్‌కు నీటిని మళ్లించే సుంకేసుల డ్యాం వద్ద లెవెల్‌ను తగ్గించుకోవడంతో, శనివారం రాత్రి నుంచి తుమ్మిళ్ల దగ్గర నీటిస్థాయి పెరిగింది. ఆదివారం ఉదయానికి తుమ్మిళ్ల వద్ద 291.4 పాయింట్ల స్థాయిలో



జూలకల్ సమీపంలో ప్రవహిస్తున్న నీరు

నీరు రావడంతో అధికారులు మోటార్ ఆన్ చేసి నీటిని వదిలారు. డీ-24 వద్ద ఆర్డీఎస్ కెనాల్‌లో నీరు విడుదలై, మధ్యాహ్నం సమయానికి దిగువ డిస్ట్రిబ్యూటరీలకు నీరు చేరింది. దీంతో మొక్కజొన్న రైతులు పంటలకు నీరు పెట్టుకోవడంలో నిమగ్నమయ్యారు. ఎట్టకేలకు నీటి విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా మునిరంగస్వామి శకటోత్సవం



శకటోత్సవంలో ట్రాక్టర్లు

భూత్పూర్: పట్టణంలో కొనసాగుతున్న మునిరంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శకటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆటోలు, జీపులు, జేసీబీలు, ట్రాక్టర్లను మామిడి, కొబ్బరి ఆకులు, రంగురంగుల కాగితాలతో అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. పుర చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి, జిల్లాకేంద్రం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి జరిగిన రథోత్సవంలో రథాన్ని ఆలయం నుంచి చౌరస్తాలోని సీతా రామాంజనేయస్వామి ఆలయం వరకు తీసుకెళ్లి తిరిగి దేవాలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శకటోత్సవంలో ఒక్క ఎద్దులబండి కనిపించలేదు. బీఆర్ఎస్ నాయకుడు మురళీధర్‌గౌడ్ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా భక్తులకు అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న దాత మురళీధర్‌గౌడ్

గిరిజన సమస్యలపై ఉద్యమించాలి

తెల్లరాళ్లపల్లిలో జిల్లా మహాసభలు ప్రారంభం

పాన్‌గల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి గిరిజనులంతా ఐకమత్యంతో ఉద్యమించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ పిలుపునిచ్చారు. పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో గిరిజన సంఘం జిల్లా రెండో మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. గ్రామంలో ఆట, పాట, నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను విస్మరించాయని అన్నారు. గిరిజనులకు కేటాయిస్తున్న బడ్జెట్‌లో అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని విమర్శించారు. పేద వర్గాలకు విస్మరించి పెట్టుబడిదారులకు లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. గిరిజనులకు మాడా ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి వారిని ఆదుకోవాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, గిరిజనులకు గిరిజనబంధు అమలు చేయాలని,



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మనాయక్

సాగు చేసుకుంటున్న పోడుభూమి రైతులకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించి నిధులు కేటాయించాలని వంటి సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు నిర్వహించేలా సభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్, ఉపాధ్యక్షులు మత్రునాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, బాలు, రాజునాయక్, తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ, అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్, కిష్టాపూర్‌తండా సర్పంచ్ దేవిసింగ్, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.